
నాన్న - నేను
బుజ్జాయి

- **నాన్న – నేను** (**NAANNA - NENU** *by Bujjai*)
  బుజ్జాయి

- **మొదటి ముద్రణ :** అక్టోబర్ 2010
  **ద్వితీయ ముద్రణ :** జూన్ 2013
  **ప్రతులు : 500**


© సర్వ హక్కులు బుజ్జాయివి


- **రచయిత చిరునామా:** నెం.23, జర్నలిస్టు కాలనీ,
  శ్రీనివాసపురం, తిరువాణ్మియూర్, చెన్నై-600 041
  ఫోన్స్: 044-24512565, 09551280733



- **కవర్ :** కృష్ణశాస్త్రి ఫొటో – బుజ్జాయి
  బుజ్జాయి ఫొటో – శివశ్రీ అడిదెం

  **కవర్ డిజైన్ : కృష్ణశాస్త్రి**

- **మూల్యం : రూ. 250/-**
  **U.S. $ 15** (abroad)

- **డి.టి.పి : కె.కె.రావు,** చెన్నై

- **పుస్తక రూపకల్పన :**
  **క్రియేటివ్ లింక్స్,** 1-8-725/ఎ/1, 103 సి,
  బాలాజి భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్, నల్లకుంట, హైదరాబాద్-500 044.
  ఫోన్స్ : 98485 06964, 98480 65658.

- **ప్రతులకు :**
  **కళాతపస్వి క్రియేషన్స్,** చెన్నై
  **క్రియేటివ్ లింక్స్**
  **విశాలాంధ్ర**
  **నవోదయ బుక్ హౌస్,** సుల్తాన్ బజార్, హైదరాబాద్.
  **తెలుగు బుక్ హౌస్,** సుల్తాన్ బజార్, హైదరాబాద్
  మరియు అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

# మా పూర్వీకులు

మా తాతలు ఇద్దరు అన్నదమ్ములు. పెద్దాయన పేరు దేవులపల్లి సుబ్బరాయ శాస్త్రి. రెండో ఆయన పేరు కృష్ణశాస్త్రి (తమ్మన్నశాస్త్రి అని కూడా పిలిచేవారు). వీరిద్దరూ పిఠాపురం ఆస్థాన కవులు. వీరిద్దరిపైనా పిఠాపురం రాజాగారికి చెప్పలేని గౌరవమూ, అభిమానము. వీరిద్దరూ ఇంటి దగ్గిర పూజచేసి, తీసుకుని వెళ్లి అక్షతలు వారిమీద వేసేవరకూ వారు బైటకు వచ్చేవారు కాదని చెప్పేవారు.

సుబ్బరాయశాస్త్రి గారికి (భార్య పేరు నాకు గుర్తు లేదు) అయిదుగురు కూతుళ్లు. తమ్మన్న శాస్త్రిగారికి ఇద్దరు కూతుళ్లు–వెంకట రమణమ్మ, వెంకట రత్నమ్మ. ఒక కొడుకు, ఆయన పేరు కృష్ణశాస్త్రి (మానాన్న). వీరిది ఉమ్మడి కుటుంబం. మా నాన్నకి ఆరుగురు అక్కలు, ఒక చెల్లెలు అన్నమాట. మా నాయనమ్మ పిఠాపురం దివాన్‌గారి ఏకైక కుమార్తె. చాలా ఆస్తిపరులూ, మోతుబరులూ. ఆమె నిద్ర లేచేటప్పటికి తలకింద ఒక బంగారపు కాసు వాళ్ల తండ్రిగారు రోజూ పెట్టేవారట. మా నాయనమ్మ చెబుతూ ఉండేది. ఆమె పేరు సీతమ్మ.

మా తాతలకి రాజాగారు, ఆ రోజుల్లో 200 ఎకరాల పొలం ఇచ్చారట. ఏడుగురు కూతుళ్లకీ వివాహాలు చేశారు. వందెకరాల పొలం అమ్మేశారు. మా నాన్న అంటే అక్కలందరికీ చెప్పలేని ప్రేమ. తమ్ముడు– తమ్ముడని ఎంతో గారం చేసేవారట. ఇంక వారి పెదనాన్న గురించి చెప్పక్కరలేదు. చెప్పలేని ప్రేమ. మా నాన్నగారిని బొజ్జమీద కూచో బెట్టుకుని "అమరకోశం", ఇతర కావ్యాలు చెప్పేవారట. "పెద్దయ్యాక నీకు పెళ్లి అయి, కొడుకు పుడితే ఎవరి పేరు పెడతావురా?" అని మా నాన్నగారిని ఆయన అడిగేవారట. "మీ పేరే" అని మా నాన్న అనేవారట. అందుకే నాకు 'సుబ్బరాయ శాస్త్రి' అని పేరు పెట్టారు.

ఈ ఉమ్మడి కుటుంబంలోకి అల్లుళ్లు రావడంతో గొడవలు ప్రారంభం అయ్యాయి. పెద్దాయన అల్లుళ్లలో ఒకాయన పెద్ద "పొలిటీషియన్". ఆస్తి పంచాలనే గొడవలు తెచ్చిపెట్టాడు. దీనితో రామ లక్ష్మణుల్లాగ ఉంటున్న మా తాతలకి ఏం చెయ్యాలో తెలియలేదు. మా పెద్ద తాతగారికి గుండెపోటు వచ్చింది. ఆయన చేత ఏవో సంతకాలు పెట్టించేశారు. మరి కొద్ది రోజులకి ఆయన మరణించారు. అన్నగారు చనిపోగానే బెంగ పెట్టుకుని మా తాతగారు కూడా సంవత్సరం తిరగకుండా మరణించారు. అప్పుడు మా నాన్నకి 12 ఏళ్లు. పిఠాపురం రాజాగారికి మా తాతలు పంచుకున్నారని తెలిసి ముందు చాలా కోపం వచ్చిందట. కానీ,

తరువాత నిజం తెలుసుకున్నారు. అప్పటి నుంచి మా నాన్నగారి చదువుకని నెలకి రూ. 50 లు ఇచ్చేవారట. మా నాన్నగారిని తమ్ముడిలాగే చూసుకుని వారి యోగక్షేమాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండేవారట.

స్కూల్ ఫైనల్ వరకు పిఠాపురంలో చదివి కాకినాడ కాలేజీలో ఇంటర్ చదివారు. అప్పుడు శ్రీ వేంకటరత్నం నాయుడు గారు ఆ కాలేజీ ప్రిన్సిపాల్. వారి ప్రభావంలో పడ్డారు. ఆ రోజుల్లో బి.యే. చదవాలంటే మద్రాసైనా వెళ్లాలి. లేక విజయనగరం వెళ్లాలి. విజయనగరంలో మా నాన్నగారి పెద్ద అక్కగారి కుటుంబం ఉండేది. ఆమె భర్త విజయనగరం ఆస్థానం దివాన్‌గా ఉండేవారు. వారిపేరు గాదేపల్లి సీతారామస్వామి. వీరి భార్యే మా పెద్ద తాతగారి పెద్ద కూతురు. వీరింట్లో ఉండి అక్కడ బి.యే. చదివారు. అక్కగారికి ఒక కూతురూ, కొడుకూ. బి.యే. ప్యాసవగానే వారి కుమార్తెని మా నాన్నకి ఇచ్చి వివాహం చెయ్యాలని నిశ్చయించారు. ఆమె పేరు సుబ్బలక్ష్మి.

పిఠాపురం రాజాగారు ఈ సంగతి తెలుసుకుని చాలా సంతోషించారు. పెళ్లికి వారు ఊరేగిన 'బంగారపు అడ్డల' పల్లకీ విజయనగరం పంపించారట. దానితో 6 మంది 'గన్‌మెన్' లు కూడా వచ్చారట. మా నాయనమ్మ చాలా గర్వంగా చెబుతూ ఉండేది.

1917 లో బి.యే. ప్యాసయి, 1918 లో పెళ్లి అవగానే పిఠాపురం రాజాగారి స్కూల్లో ఉద్యోగం ఇచ్చారు. ఒక సంవత్సరం అవగానే అక్కడ తీసేశారు. వెంటనే పెద్దాపురం స్కూల్లో ఉద్యోగం దొరికింది. అక్కడ కూడా ఒక సంవత్సరం అవగానే తీసేశారు. అప్పుడు కాకినాడలో మా నాన్నగారి బావగారు శ్రీ వింజమూరి నరసింహారావుగారు, మెక్లారన్ హైస్కూల్లో పనిచేస్తూ ఉండేవారు. ఆయన ఆ స్కూల్లో మా నాన్నకి ఉద్యోగం ఇప్పించారు. అది కూడా ఒక సంవత్సరం అయాక తీసేశారు. కారణం కొత్త కవిత్వం, దాని ప్రభావంలో పడ్డారు. సభలని తిరుగుతూ ఉండేవారు.

1921 లో మా నాన్నకి చాలా జబ్బు చేసింది. లివర్‌కి సంబంధించినది (డిస్పెప్సియా). ఏది తిన్నా జీర్ణం కాదు. మనిషి పుల్లలా అయిపోయారు. ఆ రోజుల్లో దానికి సరైన మందు లేదు. మా మామ్మకి జాతకాలంటే చాలా నమ్మకం. ఎవరికో మా నాన్న జాతకం చూపించిందట. ఆయన "నీ కొడుక్కి ఏమీ భయం లేదు. సముద్రంలో పారేసినా చావడు. చాలా పైకొస్తాడు. పెద్ద పేరు తెచ్చుకుంటాడ"ని చెప్పారు. ఇంతలో కొవ్వూరులో ఎవరో ఒక డాక్టరుగారు ఉన్నారని, ఆయన దగ్గరికి

తీసుకెళ్లండి అని సలహా ఇచ్చారు. కొవ్వూరు వెళ్లి ఆ డాక్టరుగారిని కలిశారు. ఆయన వ్యాధి కుదరడానికి చాలా రోజులు పడుతుంది అని చెప్పారు. ఆ ఊళ్లో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని వైద్యం చేయించుకుంటూ అక్కడున్నారు. అప్పుడే మా నాన్నగారు లేచి కూర్చోవడానికి కూడా ఓపిక లేక "కృష్ణపక్షము" లో పద్యాలన్నీ గోడమీద పెన్సిల్‌తో వ్రాసుకున్నారట. "ఏను మరణించుచున్నాను" ఇతర పద్యాలు. మళ్లీ మామూలు మనిషి అవడానికి ఆరు నెలలు పట్టింది. నాయనమ్మ వంతు ఎంత ఖర్చు అయినా ఇవ్వడం, రోజూ మద్రాసునుంచి ఒక కొత్త షర్ట్ తెప్పించుకునే వారట మా నాన్న. ఇంక ఆయనకి 24 గంటలూ అంటి పెట్టుకు సేవ చేస్తూ ఉన్నది వారి భార్య సుబ్బలక్ష్మి. మా నాన్నగారికి జబ్బు కుదిరింది గానీ, సుబ్బలక్ష్మికి జబ్బు ప్రారంభమయింది. టి.బి. అని డాక్టర్లు చెప్పారు. మద్రాసు తీసుకు వెళ్లి వైద్యం చేయించారు. కానీ లాభం లేకపోయింది. 1921లో ఆమె మరణించింది.

ఈ సంఘటన జరిగాక మా నాన్నగారు ఇంటిపట్టున ఉండకుండా సంవత్సరానికి 11 నెలలు కొత్త కవిత్వ ప్రచారం చేస్తూ బరంపురం నుంచి బళ్లారి వరకూ ఆంధ్రదేశం అంతా తిరిగేవారు. మా నాయనమ్మ "మా నాన్నకి మళ్లీ వివాహం చేస్తే ఇంటిపట్టున ఉంటాడు" అని నిశ్చయించుకుంది. ఎంతో బలవంతపెట్టి పిఠాపురం వాస్తవ్యులు గాడేపల్లి సూర్యనారాయణ శర్మగారి కూతుర్ని మా నాన్నగారికి చూపించింది. మా నాన్న, మా నాయనమ్మని సంతోషపెట్టడానికి "సరే చేసుకుంటాను, కానీ పెళ్లి హడావిడిగా పెద్దఎత్తున చెయ్యవద్దు" అన్నాడు. 1923 లో 'సర్పవరం' గుడిలో మా నాన్నకీ, రాజహంసకీ వివాహం జరిగింది.

పిఠాపురం రాజాగారికి అప్పుడే మా నాన్నమీద చాలా కోపంగా ఉంది. ఈ కొత్త కవిత్వం వ్రాయడం, దాన్ని ప్రచారం చెయ్యడం, ఈ పెళ్లితో కోపం మరీ ఎక్కువ అయిపోయింది. కారణం సూర్యనారాయణ శర్మగారు కాంగ్రెసు వాది. రెండు మూడు సార్లు జైలుకి వెళ్లి వచ్చారు. ఆయన కూతుర్ని పెళ్లి చేసుకున్నాడు. దానితో కోటలోకి అడుగు పెట్టగూడదు (దేవిడీ మన్నా) అని శాసించారు. అన్ని 'అలవెన్స్' లూ కట్ చేసేశారు. తల్లావఝుల శివశంకర శాస్త్రిగారూ, ముద్దుకృష్ణగారూ, నండూరి– వీరందరూ మా నాన్నగారిని ప్రోత్సహించి, వారు అంతవరకూ వ్రాసిన పద్యాలన్నీ సేకరించి "కృష్ణ పక్షము" అని నామకరణం చేసి 1925లో పుస్తక రూపంలో అచ్చు వేయించారు. దేశంలో పెద్ద సంచలనం కలిగింది. పెద్ద గాలి దుమారం లేచింది. పాత కవులందరూ మా నాన్ననీ, 'కృష్ణపక్షము'ను తిడుతూ పత్రికల్లో వ్రాశారు. సభల్లో మాట్లాడేరు. "దీనికి సమాధానంగా మనమూ వ్రాయాలి" అని మా నాన్నగారి

మిత్రులు సలహా యిస్తే, “మనం ఈ కొత్త కవిత్వం వ్రాయడమే దానికి సమాధానం” అని మా నాన్న అన్నారట. ‘కృష్ణపక్షము’ విడుదల అయ్యాక మా నాన్న భావ కవిత్వం ప్రచారం ఇంకా ఎక్కువైపోయింది. వివాహం జరిగినా ఇంటి పట్టున ఒక నెలైనా ఉండేవారు కాదు. 1925 ప్రాంతంలోనే మా నాన్న పిఠాపురంలో హరిజన హోమ్ పెట్టారు. వారితో కలిసి అక్కడే భోజనం చేసేవారు. అందుచేత మా కుటుంబాన్ని వెలివేశారు. అంటే బంధువులెవరూ ఏ శుభకార్యాలకీ వారింటికి పిలవరు. అలాగే వారు దేనికీ మా యింటికి రారు. ఎవ్వరూ మాకు యిల్లు కూడా అద్దెకు ఇవ్వరు. కాబట్టి ఊరు బైట ఒక ఇల్లు తీసుకుని మా నాయనమ్మ, పెద్ద అత్తయ్య, అమ్మ, నాన్న అక్కడున్నారు. అప్పుడు ఆ హోమ్‌లో పెంచి పెద్ద చేసిన వారి కుటుంబాల్లో ఇప్పుడు ఎంతమందో కృష్ణశాస్త్రిలు, రాజహంసలు ఉన్నారు. తరువాత దేశంలో మా నాన్నగారికి పేరు వచ్చాక బంధువులు నెమ్మదిగా రావడం, మళ్లీ వాళ్ల ఇంటికి పిలవడం జరిగింది. హరిజన హోమ్ పెట్టిన ఆ రోజుల్లోనే హేమచంద్ర సర్కార్ ప్రభావంలో పడి వేశ్యా వివాహ సంస్థను స్థాపించి ఎన్నో వివాహాలు చేయించారు. అప్పుడు కులాంతర వివాహాలు కూడా చేయించారు.

నేను 1931 సెప్టెంబర్‌లో పిఠాపురంలో పుట్టాను. నా నాలుగో ఏటనుంచి జరిగిన సంఘటనలు చాలావరకూ జ్ఞాపకం ఉన్నాయి. నా చిన్నతనం చాలా చిత్రమైన పద్ధతిలో గడిచింది. ఇలా ఆ రోజుల్లోనూ, ఈ రోజుల్లోనూ కూడా ఎవరికీ జరిగుండదు. కోటికొకడికి అయుంటుంది. చాలా చెడూ, చాలా మంచీ కూడా జరిగింది. God has been very kind to me.

లేక లేక మా తల్లితండ్రులకి నేను పుట్టాను. నా ముందు ఒక అబ్బాయి పుట్టి కొన్ని నెలలు తరువాత మరణించాడు. నేను పుట్టిన 20వ రోజే మా నాన్నగారు నన్నూ, మా అమ్మనీ కాకినాడ తీసుకుని వచ్చేశారు. మా కుటుంబానికి మా మేనత్తగారి కుటుంబానికి కలిపి ఒక ఇల్లు తీసుకున్నారు. మా కుటుంబం – మా నాయనమ్మా, మా పెద్ద మేనత్తా (వితంతువు), అమ్మా, నాన్నా, నేనూ, ఇక మా మేనత్తగారి కుటుంబం మేనత్త వెంకట రత్నమ్మా, ఆమె భర్త, మా మామ వింజమూరి నరసింహారావు, మా బావ ప్రభాకరం, పెద్ద వదిన అనసూయ, చిన్న వదిన సీతా, వాళ్ల మేనత్తా, వాళ్ల నాయనమ్మా (ఇద్దరూ వితంతువులు)– సమిష్టి కుటుంబం మాది. అందరూ నన్ను అతి గారాబం చేసేవారు. మా నాన్న అంతవరకూ ఎప్పుడూ ఇంటిపట్టున సంవత్సరానికి ఒక నెల కూడా ఉండేవారు కాదు.

మిత్రుల వత్తిడి వల్ల మరి రెండు నెలల తరువాత ఈ సమావేశం పామ్‌గ్రోవ్‌లో ఏర్పాటు చేశాను. శ్రీ శ్రీ గారు,ఎ.ఎస్. రామన్ గారు, నరసరాజు గారు, రజనీకాంతరావుగారు, బి.యస్.ఆర్.కృష్ణ గారు, విశ్వనాథ, పి.బి.శ్రీనివాస్–ఇలా వారి మిత్రులు చాలా మంది వచ్చారు. శ్రీ శ్రీ గారు ఆవిష్కరించారు. మొదటి ప్రతి శ్రీ నళినీకాంతరావుగారికి అందజేశారు. ప్రెస్‌లో బాగా రాశారు.

## పిబిఎస్ క్యాసెట్

పి.బి. శ్రీనివాస్ నాకు ఉన్న కొద్దిమంది మిత్రుల్లో ఒకరు. వారికి మా నాన్నగారంటే చెప్పలేని గౌరవం, మా నాన్నగారికి పి.బి.ఎస్ అంటే చెప్పలేని అభిమానం. వీరు బాణీలు అంటుంటే దానికి మాటలు సమకూర్చి చేసినవి చాలా అద్భుతమైనవి పాటలు ఉన్నాయి. వాటిలో ఒక ఆరు ఎంపిక చేసి ఒక క్యాసెట్‌గా తయారు చేసి, సరిగ్గా మరుసటి సంవత్సరం మా నాన్నగారి పుట్టిరోజున విడుదల చేశారు. ఉడ్‌ల్యాండ్ డ్రైవ్ ఇన్‌లో ఒక చిన్న సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి శ్రీ ఎ.ఎస్. రామన్‌గారు అధ్యక్షత వహించారు. శ్రీ జగ్గయ్యగారు మొదటి కాపీ అందుకున్నారు. వి.ఎ.కె. రంగారావుగారు ఉపన్యసించారు. ఆయన మాట్లాడుతూ "ఇంతవరకూ పి.బి.యస్. పాడిన పాటల్లో ఇవి అద్భుతమైనవి" అని అన్నారు. నిజంగా అద్భుతంగా, ఉత్తేజంతో పాడినవి.

## చి|| రేవతి వివాహం

నా పెద్ద కూతురు చి|| రేవతి బి.ఏ. మొదటి తరగతిలో ప్యాసయింది.దానికి పెళ్లి సంబంధాలు చూడమని, నా భార్య రోజూ నన్ను పోరుతూ ఉండేది. మీరేమీ పట్టించుకోడం లేదు అని దెబ్బలాడేది. మా నాన్నగారు చనిపోయాక మూడేళ్లు ఈ పుస్తకాలు అచ్చువేయించి బైటకు తెచ్చే పనిలో మరే విషయం ఆలోచించడానికి వ్యవధి లేకుండా పోయింది. ఇక నా వల్ల ఏమీలాభం లేదని తానే పూనుకుని ఏవో సంబంధాలు చూడ్డం మొదలు పెట్టింది. విజయవాడో, కాకినాడో ఎక్కడో చదువుకున్న కుర్రాళ్లు, అక్కడ ఉద్యోగం చేస్తూ స్థిరపడిన పెళ్లికొడుకులు చూడ్డానికి వస్తున్నారు అని చెప్పేది.

నా ముగ్గురు పిల్లలు పుట్టింది హైద్రాబాద్. పెరిగింది, చదువూ మద్రాసు. ఇక్కడ ఎస్సెసెల్సీ చదివిన వాళ్లతో, అక్కడ ఎమ్‌ఏ చదివిన వాళ్లు సరిగ్గా మాట్లాడలేరని నా అభిప్రాయం. ఇక్కడ చదువు పునాదికీ, అక్కడికీ చాలా తేడా ఉంది. ఇవి కుదరదు

# మా వదినగారి కుటుంబం

మా వదినగారి పేరు రాజేశ్వరి. పట్టాభిగారి మనుమరాళ్లలో అందరికన్నా పెద్దవారు.ఆమె పేరు కూడా పట్టాభిగారి భార్యపేరు. తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోవడం వల్ల ఈమె ఎక్కువగా తాతగారి దగ్గరే పెరిగారు. వారి పద్ధతులన్నీ పూర్తిగా అలవరచుకున్నారు. ఆమె భర్త మహాకవి శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారి రెండో కొడుకు. వారు అమెరికాలో ఇంజనీరింగ్ చదివి, ఆంధ్రప్రభుత్వంలో చీఫ్ ఇంజనీర్‌గా ఉండేవారు. పేరు శ్రీనివాస మార్తాండం. మంచికవి. కానీ ఇంగ్లీషులో వ్రాసేవారు. వీరు రాయప్రోలు, దేవులపల్లి, అబ్బూరి, శ్రీశ్రీ గారి కవితలు ఇంగ్లీషులోకి అనువదించి ఇలస్ట్రేటెడ్ వీక్లీలోను, మరికొన్ని పత్రికల్లోనూ ప్రచురించారు. వీరికి ముగ్గురు కూతుళ్లు. ముగ్గురూ గోల్డ్ మెడలిస్ట్‌లు. మా వదిన గారు లక్ష్మిని (అంటే నా భార్యని) తల్లీ తండ్రీ లేని కొరత లేకుండా చూశారు. నా ముగ్గురు పిల్లల పురుళ్లకీ దగ్గరున్నారు.  ఆదర్శ దంపతులు అంటే వీరే. ఒకరి అభిప్రాయాలతో ఒకరు విభేదించడం అన్నది నేను ఎప్పుడూ చూడలేదు. మా కుటుంబంలో మంచి జరిగినా, చెడ్డ జరిగినా ఆమె వచ్చి ఆదుకున్నారు.

1973 లో  ఆంధ్రప్రదేశ్  సమాచార శాఖ డైరెక్టరు వామనరావుగారు కబురు పెట్టారు. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు గారి స్వీయ చరిత్ర 'బొమ్మల కథ' గా వెయ్యమన్నారు. ఇది ఒక ఛాలెంజ్ గా తీసుకొని  వేశాను. చాలా మంచి స్పందన వచ్చింది. అందుచేత వీరేశలింగంగారి స్వీయ చరిత్ర వెయ్యమన్నారు. అదీ వేశాను. ఇలా 1948–78 కాలంలో రకరకాల బొమ్మల కథలు 100 పైగా వేశాను. 1978 లో ఆంధ్రప్రభ దినపత్రిక వారు మాకు ఏదైనా డైలీ స్ట్రిప్ వెయ్యమని అడిగారు. డిటెక్టివ్ కథలు వేస్తే మంచి రెస్పాన్స్ వస్తుంది అని సూచించాను. చాలా పాపులర్ అయ్యాయి. 1985 లో 'ఆంధ్రప్రభ' వార పత్రిక వారు 'పంచతంత్రం' కొరత తీర్చమన్నారు. నేను 1963–68 ఇల్లస్ట్రేటెడ్ వీక్లీకి వేసిన వెర్షన్స్ మొత్తం ఇంగ్లీషులో కలర్‌లో ఉన్నాయి. అ డ్రాయింగ్స్ ఇస్తే చెడిపోతాయేమోనని మళ్లీ పూర్తిగా తెలుగులో వేశాను. ఆరేళ్లు పూర్తిగా ప్రచురించారు. 1987లో అనుకుంటాను 'ఆంధ్రప్రభ' దిన పత్రిక 'విజయనగరం' ఎడిషన్ మొదలుపెడుతున్నాము. విజయనగరం వారికి  ఆసక్తి ఉండే విషయం వేస్తే బాగుంటుందని 'కన్యాశుల్కం' నాటకం మీద బొమ్మలకథ వెయ్యాలి అన్నారు. "అది నా వల్ల కాదు, చాలా కష్టం, ఒకే కేరక్టర్ రెండుమూడు పేజీలు మాట్లాడతాడు. ఇది బొమ్మల్లో చూపించడం చాలా కష్టం, బోరు కొడుతుంది"

అని చెప్పాను. "వీల్లేదు వేసి తీరాలి, మీ పేరు అప్పుడే ప్రకటించాం" అన్నారు. ఒప్పుకున్నాను. 5–6 ఏళ్ళు ఆంధ్రప్రభలో కలర్‌లో వీక్లీ సప్లిమెంట్‌లో ప్రకటించారు. బాగా పాపులర్ అయింది. 50 ఏళ్లలో ఎన్నో విధాలైన కథలు వేశాను.

నా కుమారుడు బబ్లూకి చిన్నప్పటి నుంచి బొమ్మలంటే చెప్పలేని ఆసక్తి ఉండేది. నేను బొమ్మలు వేస్తుంటే ప్రక్కన ఒక చిన్న స్టూల్ వేసుకుని కూచుని చూసేవాడు. వాడు పి.యు.సి. లో ఉన్నప్పుడే బొమ్మలు వెయ్యడం, పత్రికలకి పంపడం జరిగింది. నేనూ నీలాగ బొమ్మలు వేస్తాను అనేవాడు. "అది మాత్రం వద్దు" అని నేను చాలా నిరుత్సాహ పరిచాను. "నువ్వు బి.ఏ. ప్యాసయి ఒక స్థిరమైన ఉద్యోగంలో చేరాలి. ఒకటో తారీఖుకుకి నీకు జీతం చేతిలో ఉండాలి. ఈ బొమ్మలు వెయ్యడం, ఫ్రీలాన్స్ చెయ్యడం నాకు ఇష్టం లేదు. ఇది తాడూ బొంగరం లేని పని" అని చెప్తే, నువ్వు నిలదొక్కుకోలేదా అని ప్రశ్నించేవాడు. "నాది చాలా అరుదైన కేసు. నువ్వు బియ్యే పూర్తి చేసి మంచి రెగ్యులర్ ఉద్యోగంలో చేరాలి, అంతే" అని చెప్పాను. కానీ వాడు బొమ్మలు వెయ్యడం, ఏదోవిధంగా డబ్బులు సంపాదించడం చేస్తూనే ఉన్నాడు. బియ్యే మాత్రం నాకోసం చదివి ప్యాసయ్యాడు. ఒక రోజు అన్నాడు. "నాన్నా ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌వాళ్లు కార్టూనిస్ట్ కోసం చూస్తున్నారట. "రాజమోహన్‌గారు ఎడిటర్. నువ్వు నన్ను ఆయనకి పరిచయం చెయ్యవచ్చుగా" అన్నాడు. ఉద్యోగం అంటున్నాడు కనక సరే అన్నాను. "రాజమోహన్‌కి నేను గుర్తు ఉండకపోవచ్చు. వాళ్లింటికి నేను, తాతా 30 ఏళ్లక్రితం భోజనానికి వెళ్లాము. అప్పుడు ఆయన చాలా చిన్నవాడు. అయినా నా పేరూ, 'పంచతంత్రం' గురించి చెప్తే చాలు. అదీకాక ఇప్పుడు కూడా నేను వాళ్ల పత్రికలకే కదా వేస్తున్నాను" అన్నాను. ఎక్స్‌ప్రెస్ ఆఫీస్‌కి వెళ్లాము. నా కార్డ్ ఆయనకి పంపాను. వెంటనే లోపలికి రమ్మన్నారు. ముందు నేనెవరో చెప్పాను. తరువాత వారి తండ్రిగారినీ, తల్లిగారినీ, నాకు బాగా తెలుసు అని చెప్పాను (దేవదాస్ గాంధీ – గాంధీగారి కుమారుడు). ఆయన నా పంచతంత్రం ఎప్పుడూ చూసేవాడిని అని చెప్పారు. తరువాత నేను వచ్చిన పని చెప్పాను. బబ్లూ వేసిన డ్రాయింగ్స్ చూశాడు. చాలా మెచ్చుకున్నాడు. వెంటనే మా పత్రికలో చేరవచ్చు అని చెప్పారు. మరునాడే ఎక్స్‌ప్రెస్‌లో చేరాడు. ఒక సంవత్సరమో ఎంతో అక్కడ పని చేశాడు. ఈ మధ్యలో విడిగా పుస్తకాలకీ ఏవో బొమ్మలు అవీ కూడా వేస్తూనే ఉన్నాడు. ఇంతలో హిందూలో ఏదో ప్రకటన చూశాడు– ఒక కొత్త కంపెనీకి ఆర్ట్ డైరెక్టర్ కావాలి అని. దానికి అప్లై చేశాడు. వెంటనే ఇంటర్వ్యూకి పిలిచారు. వెళ్లి వచ్చాడు. మరి నాలుగు రోజుల్లో ఉద్యోగంలో చేరమని ఉత్తరం వచ్చింది. అంతే. ఆ

## పట్టాభిగారు

1959 డిసెంబరులో అనుకుంటాను, లక్ష్మికి ఎనిమిది నెలలు నిండాయి. నేను, నాన్న ఎందుకో మద్రాసు వచ్చాము. అదే సమయంలో వాళ్ళ తాతగారు శ్రీ పట్టాభిగారు మరణించారు. రాచ మర్యాదలతో అంత్యక్రియలు జరిపించారు. ప్రభుత్వ సెలవు దినం ప్రకటించారు. మునిమనుమరాలిని చూడకుండానే ఆయన కన్ను మూశారు.లక్ష్మి చాలా ఆందోళన చెందింది. నా పెళ్లి అయాక తరుచు నేనూ, లక్ష్మి ఆయన్ని చూడ్డానికి వెళ్లేవాళ్లం. ఆ రోజుల్లోనే నేను వారి పెన్సిల్ స్కెచ్ వేశాను. అప్పుడే ఆయన నాకు చెప్పారు. "నీకో ఫోన్ ఉండాలి. అలాగే ఒక కారు కూడా ఉండాలి. ఇవి రెండూ అవసరాలు.కానీ అవి రెండూ వాడుకోవడం తెలియాలి" అని చెప్పారు. ఆ రోజుల్లోనే 'యువ' పత్రిక ప్రారంభించారు. అందులో నేను వేసిన కార్టూన్స్ గురించి వారి అబ్బాయి రాధాకృష్ణగారు వారితో చెబితే ఎంతో సంతోషించారు. ఆయన ఏవో సంగతులు చెబుతూ "ఊ ఇది కార్టూన్‌గా వేసుకో" అనేవారు.

## దుర్గాబాయమ్మగారు

నా మొదటి బొమ్మలు 'ఆంధ్ర మహిళ' లో ప్రచురితమయాయని ఇదివరకే చెప్పాను. శ్రీమతి దుర్గాబాయమ్మ గారు స్థాపించినదే ఆ పత్రిక. నా మొదటి ఆదాయం కూడా వారిచ్చినదే. వారికి మొదటి నుంచి నేనంటే చెప్పలేని అభిమానం.

ఆమెలాగే నేనూ స్వయం సాధనతో పైకొచ్చాను. ఎప్పటికప్పుడు నా అభివృద్ధి గమనిస్తూనే వచ్చారు. ఆమె 30 ఏళ్లు వచ్చాక బెనారస్ మెట్రిక్ చదివి పాసయ్యారు. బి.ఎ., తరువాత లా చదివారు. మహిళా సంక్షేమం కోసం ఎన్నో సంస్థలు ప్రారంభించారు.

నేను మద్రాసు వచ్చాక నన్ను కూడా బెనారస్ మెట్రిక్‌కి పంపించాలని ఆమె చాలా అనుకున్నారు. కానీ అప్పటికే నాకు 20 ఏళ్లు వచ్చేశాయి. నాకు ఎబ్బెట్టుగా అనిపించింది. ఇంతలో ఆమెకు ఢిల్లీలో మంత్రి పదవి వచ్చింది. వెళ్లారు. అప్పటికే ఇక్కడ నేను రెండు మూడు పత్రికలకి రెగ్యులర్‌గా బొమ్మలు వేస్తున్నాను. ఆమె శంకర్స్ వీక్లీ సంపాదకులు శంకర్‌తో నా విషయం చెప్పారట. నాకు కబురు పెట్టారట. అప్పుడే బాలల బుక్ ట్రస్టు ప్రారంభించారు. అందులో నాకు నెలకి రూ.3000 వేల మీద ఉద్యోగం ఇస్తానని ఆయన చెప్పారట. నాకు కబురు పెట్టారు. మా నాన్న నన్ను వదిలి ఉండలేక, నేనూ ఒక్కడ్నీ వెళ్లలేక ఆ అవకాశాన్ని పోగొట్టుకున్నాను.

అప్పట్లో ఆమెకు నా మీద కోపం వచ్చింది. కానీ తరువాత నేను ఇలస్ట్రేటెడ్ వీక్లీలో వేసిన పంచతంత్రం చూసి చెప్పలేని సంతోషాన్ని వెల్లడించారు. 'నువ్వు అనుకున్నది సాధించావు. అదే నాకు చాలా ఆనందం' అని చెప్పారు.

మా నాన్నగారి మరణ వార్త వినగానే నాకు హైద్రాబాద్ నుంచి ఫోన్ చేశారు. "బుజ్జాయి ఇంకా నీకు నేనున్నాను. వెంటనే హైద్రాబాద్ వచ్చేసెయ్. మా ఇంటి ప్రక్కనే ఒక ఇల్లు ఉంది. అది నేను చవకగా ఇప్పిస్తాను. అంతా ముందు ఇవ్వక్కరలేదు కూడా" అని ఎంతో ధైర్యం చెప్పారు.

ఆంధ్ర మహిళా సభ స్వర్ణోత్సవాల కమిటీ లో నన్ను సభ్యుడిగా వేశారు. సావనీర్ ప్రింటింగ్ అదీ నాకు అప్పజెప్పారు. కవర్ డిజైన్ నేనే వేశాను. నా మీద చెప్పలేని అభిమానం, ప్రేమ చూపించిన ముఖ్యుల్లో ఆమె ఒకరు.

## బి.ఎన్.రెడ్డిగారు

అలాగే మరో వ్యక్తి శ్రీ బి.ఎన్.రెడ్డిగారు. మొదట్లో నేను స్కూలూ, చదువూ అదీ లేకుండా బడుద్ధాయిలాగ తిరుగుతున్నాననే అభిప్రాయం ఉండేదేమో? తెలియదు. కానీ పోనుపోను నేనంటే చెప్పలేని అభిమానం, ప్రేమ వారికి కలిగింది. నన్ను సినిమాల్లో ప్రవేశ పెట్టాలని వారు చాలా ప్రయత్నించారు. అది జరగలేదు. నేను పత్రికలకి బొమ్మలు వేసి దేశంలో పేరు తెచ్చుకున్నందుకు వారు చాలా సంతోషించారు. మేము హైద్రాబాద్‌లో ఉన్నపుడు వారు ఎంఎల్‌సిగా ఉన్నారు. తరుచూ అక్కడికి వచ్చినపుడు నన్ను ఒక క్షణం కూడా వదిలేవారు కాదు. మేము మద్రాసు తిరిగి మకాం మార్చాం. వారు "నువ్వు ఏం వ్యాపారం చేసినా, పుస్తకాలు అచ్చు వేసినా, గ్రీటింగ్ కార్డ్స్ వేసినా డబ్బు కావాలంటే నేను ఇస్తాన"ని ఎన్ని సార్లో చెప్పారు. ఇచ్చారు కూడాను. మా నాన్నగారి మిత్రుల్లో నాకు సన్నిహితులైన వారిలో వీరు ముఖ్యులు.

## నార్లగారు

నార్ల గారి గురించి ఇదివరకే చెప్పాను. ఒక విధంగా వారు నా మార్గదర్శి. నన్ను దినమణికి వారే పరిచయం చేశారు. ఆంధ్రప్రభ వార పత్రిక ప్రారంభించగానే మొదటి సంచిక నుంచి నా బొమ్మల కథలు ప్రచురించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో నా చేత మొదటి సారిగా తెలుగు దిన పత్రికలో డైలీ స్ట్రిప్ కార్టూన్ వేయించినది వారే. అలాగే పాకెట్ కార్టూన్. నేనంటే చెప్పలేని అభిమానం. వారు కూడా హైద్రాబాద్ వస్తే అక్కడున్నన్ని రోజులు ఒక క్షణం నన్ను వదిలేవారు కాదు.

## నండూరి

మా నాన్నగారికి చాలా చాలా ఆప్తులు నండూరి సుబ్బారావుగారు. వారూ వీరూ ఒకేసారి కవిత్వం వ్రాయడం మొదలు పెట్టారు. ఒకరు వ్రాసినది మరొకరికి వినిపించేవారు. ఇద్దరూ సహాధ్యాయులు కూడాను. నండూరి మా నాన్నని 'ద్వారకా వాసా' అని సంబోధించేవారు. వారిద్దరు ఎంత మిత్రులో వారి కుటుంబాలు కూడా అంత సఖ్యంగా ఉండేవి. వేసంగి శలవులు వస్తే, మా రెండు కుటుంబాలు– అంటే మాదీ, వింజమూరి వారిదీ మొత్తం 10 మంది– ఏలూరు వెళ్లి వాళ్లింట్లో 15–20 రోజులుండే వాళ్లం. అలాగే వారు – నలుగురు కొడుకులు, ఒక కూతురు, ఆయన, భార్య, మా ఇంటికి వచ్చి ఉండే వారు. రాజు, సేతు, బాల, సారథి వీళ్లలో ఇద్దరికో ముగ్గురికో పెళ్లిళ్లు కూడా జరిగాయి. వీళ్లు నాతో గడిపేవారు. అప్పుడు తరుచు నేను బుద్ధుడి బొమ్మ వేసేవాణ్ణి. వాళ్లు నా చేత బొమ్మలు వేయిస్తూ ఉండేవారు. నండూరి సుబ్బారావుగారు చాలా బాగా పాడేవారు. ఆయన ఎంకి పాటలకి ఆయనే బాణీలు చేసుకున్నారు. ఆ బాణీలు అనసూయా, సీత, బి.వి. పాడేవారు.

## పద్మరాజుగారు

మేము కాకినాడలో 1937 – 40 గాంధీ నగర్‌లో పద్మరాజు గారూ మేము ఒకే ఇంట్లో పక్కపక్క పోర్షన్‌లలో ఉండే వాళ్లం. ఆ సమయంలోనే మా నాన్నగారు ఆర్. ఆర్. కాలేజీలో ఆంధ్ర వారోత్సవాలు జరిపించారు. దానికి కవులు, గాయకులు, నటులు ఎంతమందో గొప్పవాళ్లు వచ్చారు. అందరూ మా ఇంట్లో దిగారు. మా ఇంటికి దగ్గరగా కోటిపల్లి రైల్వే లైన్ ఉండేది. అక్కడ రైళ్లని చూడ్డానికి వెళ్లేవాణ్ణి. ఆ పక్కనే ఒక పిల్ల కాలువ ఉండేది. అందులో చేపలు పట్టాలని ప్రయత్నం చేసేవాణ్ని. పద్మరాజుగారితో బాగా చనువు ఏర్పడింది. రినైజాన్స్ క్లబ్బు రోజుల్లో, తరువాత 1953 లో వారు 'బంగారు పాప' చిత్రానికి వ్రాయడానికి వచ్చారు. మళ్లీ వారూ మేము ఒకే ఇంట్లో కలిసి ఉన్నాము. ఈ సారి వేర్వేరు వాటాల్లో కాదు. ఒకే ఇంట్లో 5 ఏళ్లు కలిసి ఉన్నాము. ఆయన్ని మించిన మేధావిని నేను ఎరుగను. ఏ విషయం అయినా ఆయన కచ్చితంగా చెప్పేవారు. ఆయన నాకు ఒక పెద్ద దిక్కు. నన్ను ఒక స్నేహితుడిలా చూసేవారు. ఆయన నేనూ కలిసి కొన్ని వందల ఇంగ్లీషు సినిమాలు చూశాము. నేనే బొమ్మల కథ వేసినా ఆయనకి చూపించేవాణ్ని. ఆయన ప్రోత్సహించేవారు. నా బొమ్మల కథలకి కొన్నింటికి ఆయన శీర్షికలు రాసి పెట్టారు. ఆ రోజుల్లోనే వారిచేత నేనొక డిటెక్టివ్ నవల వ్రాయించి ప్రచురించాను. అప్పటికే ఆయన అంతర్జాతీయ

ఖ్యాతి సంపాదించిన రచయిత. అయినప్పటికీ నా మీద ఉన్న ఇష్టంకొద్దీ డిటెక్టివ్ నవల వ్రాశారు. అది ఆయన ఒక ఛాలెంజిగా తీసుకుని బ్రహ్మాండంగా వ్రాశారు. కానీ కొన్ని పత్రికల వాళ్లు అంత గొప్ప రచయిత డిటెక్టివ్ నవల వ్రాయడమేమిటని విమర్శించారు. అది ఒక కొత్త ప్రక్రియగా భావించారు. వారిని ఆ రచనకు ప్రోత్సహించడానికి కారణం–ఆ రోజుల్లో డిటెక్టివ్ నవలలు వ్రాసిన వారందరూ నాకు మిత్రులే– కొమ్మూరి, టెంపోరావు, వై.వి.రావు, జివిజి. వాళ్ల నవలల్లో బతికున్న పాత్ర రాలేదు. కవర్ డిజైన్స్ ఏవో సినీమా బొమ్మల్లాంటివి వేసేవారు. ఇవి రెండూ నాకు చాలా తిక్క పుట్టించాయి. అందువల్ల పద్మరాజుగారి చేత నవలలు వ్రాయించి వేరే విధంగా కవర్ డిజైన్ చేసి ప్రచురించాను. ప్రెస్ నుంచి అలాగే అన్ని కాపీలు అమ్మేశాను. ఇదివరలో తెలుగు ప్రచురణ కర్తలు ఎందరో వారి పుస్తకాలు ప్రచురించి దమ్మిడీ రాయిల్టీ ఇవ్వలేదు. నేను అచ్చు అయిన పుస్తకంలో 10 శాతం రాయల్టీ వారికి ఇచ్చాను. ఇందులో నేను లాభం ఆశించి చెయ్యలేదు. జనానికి డిటెక్టివ్ నవల ఎలాగుండాలో చూపించాను. అంతే. తరువాత నేను హైదరాబాద్ వెళ్లిపోయాను. మళ్లీ పునర్ముద్రణ చేసి ఇమ్మని చాలా మంది అడిగారు. కానీ వీలు పడలేదు. నా దగ్గర ఒక కాపీ కూడా లేకుండా పోయింది.

నాకు మొదటి నుంచి ఏదో కొత్తది చెయ్యాలనే కోరిక. అందుకే బొమ్మల కథలు మొదలు పెట్టి, ఎంతో శ్రమ అయినా అదే పట్టుకు వదల కుండా 55 ఏళ్లు వేశాను. చాలామంది ఒకటి రెండు బొమ్మల కథలు వేసి మానేశారు. ఆ రోజుల్లోనే నా మిత్రుడు శ్రీ టెంపోరావు తాను వ్రాసిన ఒక డిటెక్టివ్ నవలని, నన్ను పూర్తిగా బొమ్మల కథగా వెయ్యమన్నాడు. 120 పేజీలు పుస్తకం బొమ్మల్లో వేశాను. అతను ప్రచురించాడు. దాని పేరు 'రాత్రి పదింటికి' అని గుర్తు.

అలాగే నా మిత్రుడు కొమ్మూరి సాంబశివరావు వ్రాసిన డిటెక్టివ్ కథలకు నేను బొమ్మలు వేశాను.అవి 'డిటెక్టివ్' మాస పత్రికలో ప్రచురితమయ్యాయి. నేను 'పెత్తందార్' వేస్తున్న రోజుల్లో 'కలిసి ఉంటే కలదు సుఖం' అనే సినీమా తీశారు. వాళ్లు నన్ను పబ్లిసిటీ కొత్త పద్ధతిలో ఆలోచించి చెప్పమన్నారు. "ముందు మీ సినిమా నాకు పూర్తిగా చూపించండి. తరువాత నేను చెప్తాన"న్నాను. సినిమా చూపించారు.ఆ సినిమాలో రేలంగి, అల్లు, సూర్యకాంతం వీళ్ల మధ్య చాలా జోక్స్ ఉన్నాయి. ఇవి డైలీ స్ట్రిప్ కార్టూన్‌గా వేస్తే బాగుంటుందని సూచించాను. వాళ్లు చాల మెచ్చుకున్నారు. ఆ పద్ధతిలో చాలా వేశాను. తెలుగు ప్రముఖ పత్రికలలో రోజూ వేశారు. ఆ సినీమా

నాకు ఉత్తరం వచ్చేది. నీ సమస్యకి పరిష్కారం ఇలా చెయ్యాలీ అని. సరైన పరిష్కారం చేసేవారు.

## మా బావగారి కుటుంబం

మా బావ మా నాన్నగారి పెద్ద మేనల్లుడు. పేరు శ్రీ వెలమకన్ని సుబ్బరాయ శాస్త్రి. ఆయనకీ మా పెద్ద తాతగారి పేరే. నా పేరూ అదే. నలుగురు కూచుని మాట్లాడుకుంటే అందులో ఏవరైనా ఎవరి గురించైనా చెడ్డగా ఏదైనా మాట్లాడుతుంటే మా బావ చెవులు మూసుకునేవాడు. ఏమిటయ్యా అలా చెవులు మూసుకుంటావే అని అడిగితే–నాకు ఎవరి గురించి చెడ్డగా వినడం అవసరం లేదు. ఎవరిగురించైనా మంచి చెప్తే వింటాను అనేవాడు. నా చిన్నప్పుడు అతని వైఖరి నాకు చిత్రంగా అనిపించేది. ఇప్పుడు అది తలచుకుంటే అతను ఎంత ఉత్తముడో అర్థమయింది. మా బావ కుటుంబం ఒక ఆదర్శ కుటుంబం.

అతనికి ఇద్దరు కొడుకులూ, ఒక కూతురు. ముగ్గరికీ వివాహాలు అయ్యాయి. పెద్ద కొడుకు పిహెచ్‌డి చేశాడు. తను చిన్న వయసులోనే చనిపోయాడు. రెండో కొడుకు పేరు సుబ్రహ్మణ్య శర్మ. ఎడ్వకేట్. వాడికి అయిదుగురు పిల్లలు. మా బావ, అక్కయ్య, అత్తయ్య వీరంతా కలిసుంటారు. సమిష్టి కుటుంబం. చిన్నకొడుకు శర్మది నాదీ ఒకే వయసు. వాడికీ నాకూ చాలా పోలిక కూడా ఉందంటారు. ఈ మనుమడంటే మా నాన్నగారికి  చాలా ఇష్టం. వాడికీ మా నాన్నంటే చెప్పలేని గౌరవం, ప్రేమ. మా నాన్నగారి వచన రచనలు ఆయన గొంతు పోయాక వీడు చదివితేనే  ఆయనకు నచ్చేది. ఎక్కడ ఏ ఉపన్యాసం చదవాలన్నా ఈ మనుమడిని రప్పించి వాడి చేత చదివించేవాడు. వీడు ఎడ్వకేట్. ఎవరైనా క్లయింటు తమరు కేసు చేసి పెట్టాలి అని అడిగితే బాబూ కోర్టుకి ఎందుకు వెడతారు. బోలెడు ఖర్చు, శ్రమ. మీరు ఒప్పుకుంటే నేను వారితో మాట్లాడి పరిష్కారం చెయ్యడానికి ప్రయత్నిస్తాను అనేవాడు. ఏమిరా నువ్వు లాయర్‌గా ఎందుకు పనికొస్తావురా అనేవాణ్ణి. వాడు నవ్వేసి ఊరుకునేవాడు. నాకు ఏ మంచి జరిగినా, చెడ్డ జరిగినా అండగా ఉండేవాడు. వాడూ ఈ మధ్యనే చనిపోయాడు. ఇలా దగ్గరవాళ్లంతా వెళ్లిపోతున్నారు.

## మా పిన్నిగారి కుటుంబం

మా బాబయ్యగారు శ్రీ నరసింహమూర్తిగారికి, మా పిన్ని సరోజినికి నేనంటే చెప్పలేని ఇష్టం. సరే–మా అమ్మా, నాన్న అంటే చాలా గౌరవం. వారికి ఒక కొడుకు

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Nanna+Nenu](http://kinige.com/book/Nanna+Nenu)

* * *